క్లుప్తంగా

మధ్యాహ్న భోజన వంటల పరిశీలన



మధ్యాహ్న భోజన వంటల నిర్వహణను పరిశీలిస్తున్న ఎంఈఓ-2 సాయిచక్రధర్

గజపతినగరం: పురిటిపెంట బాలుర హైస్కూల్‌లో మధ్యాహ్న భోజన పథకం వంటలను ఎంఈఓ-2 సాయిచక్రధర్ సోమవారం పరిశీలించారు.ఈసందర్భంగా వంటకాలను రుచి చూశారు. నిర్వాహకులతో ఆయన మాట్లాడుతూ రోజూ మెనూ ప్రకారం వంటకాలు చేయాలని, నాణ్యత, శుచి, శుభ్రత పాటించాలని సూచించారు. విద్యార్థులంతా పాఠశాలలోనే మధ్యాహ్న భోజనాలు చేసేలా చూడాలని ఉపాధ్యాయులను ఆదేశించారు.

ముగిసిన ఆలయ ప్రతిష్ఠోత్సవాలు



హోమ గుండం వద్ద పూజలు చేస్తున్న జెడ్పీ చైర్మన్ శ్రీనివాసరావు

గుర్ల: చింతలపేట గ్రామంలో మూడు రోజుల పాటు నిర్వహించిన శ్రీ భవానీ నీలకంఠేశ్వర స్వామి ఆలయ ప్రతిష్ఠో త్సవాలు సోమవారంతో ముగిశాయి. ఈసందర్భంగా ప్రత్యేక పూజలు, హోమం చేశారు. ఉత్సవాలకు హాజరైన జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావుకు ఆలయకమిటీ సభ్యులు స్వాగ తం పలికి, ఆయనతో పూజలు చేయించారు. జెడ్పీ టీసీ శీర అప్పలనాయుడు, వైఎస్సార్‌సీపీ నాయకులు పొట్నూరు సన్యాసినాయుడు, వరదా ఈశ్వరరావు, తోట తిరు పతిరావు, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

భవన నిర్మాణ పనుల పరిశీలన



కొలతలు తీస్తున్న ఏఈ హరికృష్ణ

మెరకముడిదాం: స్థానిక మండల పరిషత్ కార్యాలయ ప్రాంగణంలో చేపడుతున్న సమావేశ భవన నిర్మాణ పనులను పంచాయతీరాజ్ ఏఈ హరికృష్ణ సోమవారం పరిశీలిం చారు. కొలతలు తీసి కాంట్రాక్టర్‌కు పలు సూచనలు చేశారు. నిర్మాణ పనులను వేగవంతం చేయాలని ఆదేశించారు.

పది మద్యం సీసాలతో వ్యక్తి అరెస్టు

లక్కవరపుకోట: మండలంలోని జమ్మాదేవిపేట గ్రామ సమీపంలో సోమవారం ఎక్సైజ్ పోలీసులు దాడులు చేశారు. అదే గ్రామానికి చెందిన బి.నాయుడు అనే వ్యక్తి పది మద్యం సీసాలు కలిగి ఉండడంతో అరెస్టు చేసి కేసు నమోదు చేశామని ఎక్సైజ్ సీఐ జి.ఎస్.రాజశేఖరనాయుడు తెలిపారు. అక్రమంగా మద్యం తరలించినా,అమ్మకాలు చేసినా కేసులు తప్పవని సీఐ హెచ్చరించారు. దాడుల్లో ఎస్‌ఐ ఎస్.రమశ్రీ, సిబ్బంది బి.రాముడు, వీర్రాజు,అదినారాయణ పాల్గొన్నారు.

రాయితీపై గడ్డి కత్తిరించే యంత్రం అందజేత



పాడిరైతుకు యంత్రాన్ని అందజేస్తున్న పశువైద్యాధికారి గాయత్రి

లక్కవరపుకోట: మండలంలోని మార్లపల్లి గ్రామానికి చెందిన పాడి రైతుల సబ్బవరపు రాముకు రాయితీపై గడ్డి కత్తిరించే యంత్రాన్ని మండల పశువైద్యాధికారి కె.గాయ త్రి సోమవారం అందజేశారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈ యంత్రం విలువ రూ.33,970 కాగా రాయితీపై రూ.20,382కే అందించామని చెప్పారు.ఈయంత్రం వల్ల పశుగ్రాసం వృథాను తగ్గించవచ్చని, గడ్డిని పూర్తిస్థా యిలో పశువులకు ఉపయోగించుకోవచ్చన్నారు. ముదర గడ్డిని సైతం ముక్కలుగా చేసి పశువులకు మేతగా వేయడం వల్ల పాలలో కొవ్వు శాతం పెరుగుతుందన్నారు. స్థానిక సచివాలయ వెటర్నరీ అసిస్టెంట్ పాల్గొన్నారు.

ఫార్మర్ రిజిస్ట్రీ చేయించుకోవాలి

బొండపల్లి: సొంత భూమి ఉన్న రైతులంతా రైతు విశిష్ట సంఖ్య కోసం తమ వివరాలను రైతు సేవా కేంద్రాల్లో నమోదు చేసుకోవాలని ఏఓ పి.వి.మల్లికార్జునరావు సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. కేంద్రప్రభుత్వం రైతులకు ఆధార్‌కార్డు తరహాలో 14 అంకెల ప్రత్యేక విశిష్ట గుర్తింపు సంఖ్యను కేటాయిస్తుందని పేర్కొన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేసే వ్యవసాయ సంబంధ పథకాలు, రాయితీలు పొందేందుకు ఈ గుర్తింపు సంఖ్య తప్పనిసరని పేర్కొన్నారు. ఈనెల 25 వ తేదీలోగా రైతులు తమ పరిధిలోని రైతు సేవా కేంద్రాలకు పట్టాదారు పాసుపుస్తకం, వన్‌బీ, ఆధార్‌కార్డు, ఆధార్‌కు లింక్ అయిన ఫోన్ నంబర్ తీసుకుని వెళ్లి వివరాలను ఆన్‌లైన్ చేయించుకోవాలని సూచించారు.

రైతన్నకు దక్కని భరోసా..!



పెదవేమలిలో సాగులో ఉన్న పెసర పంట

- రైతు సేవా కేంద్రాల్లో అందుబాటులో లేని ఎరువులు
- ఖరీఫ్‌లో అందని సాగు పెట్టుబడి సాయం
- రబీ సీజన్ పెట్టుబడి కోసం తిప్పలు పడుతున్న రైతులు

గంట్యాడ:

కూటమికి అధికారం ఇస్తే రైతులకు అన్నదాత సుఖీభవ పథకం పేరిట ఏడాదికి రూ.20 వేలు పెట్టుబడి సాయంగా అంది స్తామని ఎన్నికల సమయంలో సీఎం చంద్రబాబు గొప్పలు చెప్పారు. కూటమి అధికారంలోకి వచ్చి 9 నెలలు కావస్తున్నా రైతన్నకు రూపాయి కూడా పెట్టుబడి సాయం అందించలే దు. ఖరీఫ్ సీజన్ ముగిసి, రబీ సీజన్ నడుస్తున్నా పెట్టు బడి సహాయం ఊసే ప్రభుత్వం నుంచి రావడం లేదు. అధికారం కోసం ఎన్నికలకు ముందు ఆచరణకు సాధ్యం కాని హామీలు ఇవ్వడం , అధికారంలోకి వచ్చాక అమలు చేయకుండా విస్మరించడం సీఎం చంద్రబాబుకే చెల్లుతోంది. ప్రజలను మోసం చేయడమే కాకుండా ఆ నెపాన్ని వేరే వారిపై నెట్టేయడంలో చంద్రబాబు సిద్ధ హస్తులు. సూపర్ సిక్స్ పథకాలను ఇంటింటికీ అందిస్తామని, బాబుష్యూరిటీ.. భవిష్యత్‌కు గ్యారెంటీ అని ఏ నోటితో ప్రచారం చేశారో.. నేడు అదే నోటితో సూపర్ సిక్స్ పథకాలకు గ్యారెంటీ లేదని తాజాగా నీతి ఆయోగ్ నివేదికపై ప్రజెంటేషన్‌లో సీఎం చంద్రబాబు తేల్చి చెప్పేశారు. సంపద సృష్టించి, వృద్ధిరేటు 15 శాతా నికి పెరిగితేనే పథకాలు అమలు చేస్తామని చెప్పడంతో ఖరీఫ్‌లో సాగు పెట్టుబడి సాయం కోసం ఎదురు చూసి చూసీ... రబీలోనైనా రైతుభరోసా అందించకపోతారా అని రైతులు ఆశించారు. అయితే వారి ఆశలు అడియాసలు అయ్యేలా ఉన్నాయి. రబీ సీజన్ కూడా త్వరలో ముగియ నుంది. మొత్తంగా ఒక ఏడాది పెట్టుబడి సాయం ఎగ్గొట్టే పనిలో ప్రభుత్వం ఉందన్న విమర్శలు రైతుల నుంచి వినిపిస్తున్నాయి.

పెట్టుబడి కోసం అవస్థలు

ఖరీఫ్ సీజన్‌లో కూటమి ప్రభుత్వం రైతులకు చిల్లిగవ్వలేదు. దీంతో అప్పులు చేసి విత్తనాలు, ఎరువులు, పురుగు మందుల కోసం వేల రూపాయలు పెట్టుబడి పెట్టారు. రబీలోనూ పెట్టుబడి కోసం రైతులు అప్పులు చేయాల్సి వస్తోంది. రబీసీజన్ ప్రారంభమై రెండు నెలలవుతున్నా ఇప్పటికీ కూటమి ప్రభుత్వం రైతులకు ఎటువంటి సాయం అందించకపోవడంతో నానా అవస్థలు పడుతున్నారు. గంట్యా డ మండలంలో రబీ సీజన్‌కు సంబంధించి మొక్కజొన్న, వరి, అపరాల పంటలు సుమారు 10 వేల ఎకరాల్లో సాగులో ఉన్నాయి. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో రైతులకు రైతు భరోసా పేరిట ఏటా రూ.13,500 చొప్పన సాయం ఠంఛన్‌గా అందేది.

రాయితీ పరికరాలకు దిక్కులేదు

గతంలో రైతులకు రాయితీపై టార్పాలిన్లు, స్ప్రేయర్లు, ఆయిల్ ఇంజిన్లు అందించేవారు. అయితే కూటమి ప్రభుత్వం ఇంతవరకు రైతులకు ఉపయోగపడే ఎలాంటి వ్యవసాయ పరికరాలు అందించలేదు. పురుగు మందులు పిచికారీ చేసే స్ప్రేయర్లు కూడా ఇవ్వడం లేదు. గతంలో గ్రామాల్లోని రైతు భరోసా కేంద్రాల్లోనే విత్తనాలు, ఎరువులు పంపిణీ చేసేవారు. గ్రామాల్లో మాట పక్కన పెడితే మండల కేంద్రంలో కూడా వరి విత్తనాలు దొరక్కపోవడంతో రైతులు విజయనగరంలోని ప్రైవేటు డీలర్ల వద్దకు పరుగుపెట్టాల్సి వచ్చింది. రైతు భరోసా కేంద్రాల పేరును కూటమి ప్రభుత్వం రైతు సేవా కేంద్రాలుగా మార్చి, సేవలను విస్మరించింది. ఆ కేంద్రాల్లో రైతులకు విత్తనాలు, ఎరువులు లభించడం లేదు.

అనుమతి రావాల్సి ఉంది

రైతులకు రాయితీపై పరికరాల అందజేసేందుకు ప్రభుత్వం నుంచి అనుమతులు రావాల్సి ఉంది. అనుమతులు వస్తే పరికరాలు పంపిణీ చేస్తాం. రబీలో వరి పంట తక్కువ విస్తీర్ణంలో సాగవుతుంది. పెసర, మినప విత్తనాలు రాయితీపై అందించాం.

– బి. శ్యామ్‌కుమార్, ఏఓ, గంట్యాడ మండలం

మాదక ద్రవ్యాలకు బానిస కావొద్దు



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ఎస్‌ఐ నారాయణరావు

గుర్ల: విద్యార్థులు, యువత మాదక ద్రవ్యాలు, చెడువ్యసనాలకు బానిసగా మారి జీవితాలను నాశనం చేసుకోవద్దని ఎస్‌ఐ నారాయణరావు సూచించారు. సంకల్పం కార్యక్రమంలో భాగంగా మాదకద్రవ్యాలతో కలిగే అనర్థాలపై స్థాని క ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులకు సోమవారం అవగాహన కల్పించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ చాలా మంది విద్యార్థులు, యువకులు డ్రగ్స్ వాడడం సరదాగా ప్రారంభించి వ్యసనపరులుగా మారిపోతున్నారన్నారు. డ్రగ్స్, గంజాయికి అలవాటు పడితే ఆరోగ్యం పాడవుతుందని, భవిష్యత్ అంధకారమేనని అన్నారు. మత్తుపదార్థాలకు దూరంగా ఉంటూ దృష్టి అంతా చదువుపై కేంద్రీకరించాలని, జీవితంలో ఉన్నత స్థానాలను అధిరోహించాలని పిలుపునిచ్చారు. పోలీస్ సిబ్బంది, కళాశాల అధ్యాపకులు పాల్గొన్నారు.

కరాటే పోటీల్లో ప్రతిభ



పతకాలు సాధించిన విద్యార్థినులతో ప్రిన్సిపాల్ విశ్వనాథం

కొత్తవలస: మండలంలోని అప్పన్నపాలెం గ్రామ సమీపంలో ఉన్న ఓపీ జిందాల్ విద్యామందిర్ పాఠశాల విద్యార్థినులు కరాటే పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచి పతకాలు సాధించారని ప్రిన్సిపాల్ పి.వి.ఎస్.ఎస్.విశ్వనాథం సోమవారం తెలిపారు. ఈనెల 6వ తేదీ నుంచి 9వ తేదీ వరకు విశాఖపట్నంలోని రాజీవ్‌గాంధీ ఇండోర్ స్టేడియంలో 2వ ఇంటర్నేషనల్ ఓపెన్ కరాటే చాంపియన్ షిప్ పోటీలు జరిగాయి. ఈ పోటీల్లో పాఠశాలకు చెందిన 3వ తరగతి విద్యార్థిని ఈదుబిల్లి శ్రీలక్ష్మిప్రసన్న కుమిటీ, కాటా విభాగాల్లో సిల్వర్ మెడల్, 5వ తరగతికి చెందిన దేవకీలత కుమిటీ విభాగంలో సిల్వర్ మెడల్,కాటా విభాగంలో కాంస్య పథకం సాధించారని ప్రిన్సిపాల్ చెప్పారు. విద్యార్థినులను పాఠశాల ఉపాధ్యాయ సిబ్బంది అభినందించారు.

శంబలనగరిలో ఆదిత్యుని విగ్రహ ప్రతిష్ట



విగ్రహ ప్రతిష్ట చేస్తున్న శంబలనగరి ఆశ్రమ నిర్వాహకులు

శృంగవరపుకోట: మండలంలోని కిల్తంపాలెం పంచాయతీ పరిధిలో ఉన్న శంబలనగరి ఆశ్రమంలో సూర్యభగవానుని పంచలోహ విగ్రహ ప్రతి ష్టాపన కార్యక్రమాన్ని సోమవారం ఘనంగా నిర్వహించారు. వారం రోజులుగా ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం విగ్రహ ప్రతిష్ట చేశారు. 144 కిలోల పంచలోహాలతో, 12రాశులు ప్రతిబింభించేలా ఏక చక్ర రథంపై ఆదిత్యుని విగ్రహాన్ని సుందరంగా తయారు చేశారు. కార్యక్రమంలో జిల్లాపరిషత్ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకరరావు, స్థానిక ప్రజా ప్రతినిధులు, ఆశ్రమ నిర్వాహకులు, గాయత్రి రుషి తండ్రి బిడ్డలు పాల్గొన్నారు.

నులిపురుగుల నివారణతో ఆరోగ్యం

అనేక ఆరోగ్య సమస్యలకు కారణమైన నులిపురుగులను నివారించేందుకు పిల్లలంతా ఆల్బెండజోల్ మాత్రలు వేసుకోవాలని వైద్య, ఇతర శాఖల అధికారులు, కళాశాలలు, పాఠశాలల ప్రిన్సిపాళ్లు, హెచ్‌ఎంలు, అధ్యాపకులు, ఉపాధ్యాయులు సూచించారు. జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవం సందర్భంగా గజపతినగరం, చీపురుపల్లి, ఎస్.కోట నియోజకవర్గాల్లోని అంగన్‌వాడీ కేంద్రాలు, ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు, కళాశాలల్లో విద్యార్థులకు వైద్య సిబ్బంది సోమవారం ఆల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేశారు. 1 నుంచి 19 ఏళ్ల లోపు పిల్లలందరితో మధ్యాహ్నం భోజనం చేసిన తర్వాత మాత్రలు మింగించా రు. ఈసందర్భంగా పీహెచ్‌సీల వైద్యాధికారులు మాట్లాడుతూ కడుపులో నులిపురుగులు ఉన్న పిల్లలు రక్తహీనతతో పాటు పోషకాహార లోపం, ఆకలి మందగించడం, కడుపునొప్పి, వికారం, వాంతులు, విరేచ నాలు, బరువు తగ్గడం వంటి సమస్యలతో బాధపడుతుంటారని చెప్పారు. నులిపురుగుల బారినపడిన పిల్లల్లో శారీరక, మానసిక అభివృద్ధి మందగిస్తుందని వివరించారు. మాత్రల పంపిణీ కార్యక్రమాన్ని జిల్లా వైద్యాధికారులు, ఎంఈఓలు, ఎంపీడీఓలు, తహసీల్దార్‌లు పర్యవేక్షించారు. – సాక్షినెట్‌వర్క్



గుర్ల ప్రాథమిక పాఠశాల విద్యార్థులతో ఆల్బెండజోల్ మాత్రలు మింగించడాన్ని పరిశీలిస్తున్న డీఎంహెచ్‌ఓ జీవనరాణి



బొండపల్లి: బొండపల్లి హైస్కూల్‌లో విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలు వేస్తున్న అడిషనల్ డీఎంహెచ్‌ఓ రాణి



కొత్తవలస: వియ్యంపేట గురుకుల పాఠశాలలో విద్యార్థినులకు మాత్రలు వేస్తున్న ప్రిన్సిపాల్ జయశ్రీ



గజపతినగరం: గజపతినగరంలోని బాలికోన్నత పాఠశాలలో విద్యార్థినులతో మాత్రలను మింగిస్తున్న ఎంఈఓ విమలమ్మ



గంట్యాడ: పి.ఎం.పాలెం హైస్కూల్‌లో విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న డాక్టర్ పల్లవి



మెరకముడిదాం: బిల్లలవలస హైస్కూల్ విద్యార్థులకు మాత్రలు వేస్తున్న ప్రత్యేక అధికారి వెంకటేశ్వరరావు



చీపురుపల్లి: కర్లాం ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులతో ఆల్బెండజోల్ మాత్రలు మింగిస్తున్న వైద్య సిబ్బంది



శృంగవరపుకోట: ఎస్.కోట ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో విద్యార్థులకు మాత్రలు వేస్తున్న ప్రిన్సిపాల్ కేశవరావు



గంట్యాడ: కేజీబీవీలో విద్యార్థినితో ఆల్బెండజోల్ మాత్ర మింగిస్తున్న వైద్యాధికారి హేమలత



లక్కవరపుకోట: ఎల్.కోట హైస్కూల్‌లో విద్యార్థులకు మాత్రలు వేస్తున్న తహసీల్దార్ ప్రసాదరావు



వేపాడ: వేపాడ హైస్కూల్‌లో విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న డాక్టర్ ధరణి, వైద్య సిబ్బంది,ఉపాధ్యాయులు



దత్తిరాజేరు: కేజీబీవీలో విద్యార్థినులకు మాత్రలు పంపిణీ చేస్తున్న ఎంపీడీఓ రాజేంద్రప్రసాద్

శతశాతం ఉత్తీర్ణత సాధించాలి



టెన్త్, ఇంటర్ విద్యార్థినులకు మెళకువలు చెబుతున్న గురుకులాల జిల్లా సమన్వయకర్త రూపవతి

చీపురుపల్లి: గురుకుల బాలికల పాఠశాలలు, కళాశాలల్లోని పదోతరగతి, ఇంటర్మీడియట్ విద్యార్థినులు త్వరలో జరగ నున్న పబ్లిక్ పరీక్షల్లో శత శాతం ఉత్తీర్ణత సాధించాలని బి.ఆర్.అంబేద్కర్ గురుకుల పాఠశాల/కళాశాలల జిల్లా సమ న్వయ కర్త ఎస్.రూపవతి ఆకాంక్షించారు. పట్టణంలోని బి.ఆర్.అంబేద్కర్ గురుకుల బాలికల పాఠశాల/కళాశాలను సోమవారం ఆమె సందర్శించారు. తరగతి గదులు, ఏటీఎల్ ల్యాబ్స్, స్టోర్ రూమ్‌తో పాటు మెస్‌ను పరిశీలించారు. విద్యార్థినులతో కలిసి భోజనం చేశారు. జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవం సందర్భంగా విద్యార్థినులతో ఆల్బెండజోల్ మాత్రలు మింగించారు. అనంతరం పదో తరగతి, ఇంటర్మీడియట్ విద్యార్థినులతో మాట్లాడుతూ పబ్లిక్ పరీక్షల్లో ప్రతీ విద్యార్థి ఉత్తీర్ణత సాధించాలన్నారు. పరీక్షలకు తక్కువ సమయం ఉందని, సమయాన్ని వృథా చేయకుండా ప్రణాళికాబద్ధంగా చదుకోవాలని, రివిజన్‌కు ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. ప్రతీ సబ్జెక్టుకు నిర్దిత సమయాన్ని కేటాయించుకోవాలన్నారు. అనంతరం ఉపాధ్యాయినులతో మీటింగ్ ఏర్పాటు చేసి శత శాతం ఉత్తీర్ణత సాధించేలా కృషి చేయాలని ఆదేశించారు. ఆమె వెంట గురుకులాల జిల్లా వైద్యాధికారి రాంప్రసాద్ సాహు, చీపురుపల్లి, ఉంగరాడ మెట్ట గురుకుల కళాశాలల ప్రిన్సిపాళ్లు ఏ.రాణిశ్రీ, పి.శ్రీనివాసరావు ఉన్నారు.

బినామీలకు కట్టబెట్టొద్దు



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న కల్లుగీత వృత్తిదారుల సంఘం జిల్లా గౌరవాధ్యక్షుడు పురం అప్పారావు

గజపతినగరం: కల్లుగీత కార్మికుల కోసం కేటాయించిన మద్యం షాపులను బినామీలకు కట్టబెట్టవద్దని కల్లుగీత వృత్తిదారుల సంఘం జిల్లా గౌరవాధ్యక్షుడు పురం అప్పారావు కోరారు. గజపతినగరం మండల కేంద్రంలో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎన్నికల కోడ్ పేరుతో మద్యం షాపుల లాటరీ ప్రక్రియను వాయిదా వేయడం వల్ల అప్పులు చేసి దుకాణాల కోసం దరఖాస్తుచేసిన గీతకార్మికులు ఆవేదన చెందుతున్నారన్నారు. ఎక్సైజ్ విభాగం అధికారులు క్షేత్రస్థాయిలో సర్వేచేసి కల్లుగీత కార్మికేతరులకు దుకాణాలు కేటాయించకుండా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తిచేశారు. అర్ధసంవత్సరం లైసెన్స్ ఫీజు మాత్రమే ప్రభుత్వం తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నియోజకవర్గం కన్వీనర్ కె.కోటారావు, బొండపల్లి మండలాధ్యక్షుడు కె.సూరప్పడు, తదితరులు పాల్గొన్నారు.

పరీక్షల వేల ఒత్తిడికి గురికావొద్దు



సోంపురం హైస్కూల్‌లో పదోతరగతి ప్రీఫైనల్ పరీక్షలను పరిశీలిస్తున్న ఎంఈఓ బాలభాస్కరరావు

వేపాడ: ఒత్తిడికి గురికాకుండా ప్రశాంతంగా పబ్లిక్ పరీక్షలకు సన్నద్ధం కావాలని పదోతరగతి విద్యార్థులకు ఎంఈఓలు నాగభూషణం, బాలభాస్కరరావు సూచించారు. మండలంలోని సోంపురం,వేపాడ ఉన్నత పాఠశాలల్లో సోమవారం నిర్వహించిన పదోతరగతి ప్రీఫైనల్ పరీక్షలను వారు పరిశీలించారు. ఈసందర్భంగా విద్యార్థులకు పలు సూచనలు చేశారు. పరీక్షలకు సమయం తక్కువగా ఉన్నందున ప్రణాళికాబద్ధంగా చదువుకోవాలని, ఏమైనా సందేహాలు ఉంటే సంబంధిత సబ్జెక్టు ఉపాధ్యాయులతో నివృత్తి చేసుకోవాలని సూచించారు.

ట్రాఫిక్ సమస్య



మెయిన్‌రోడ్‌ను ఆనుకుని సంతానలక్ష్మి అమ్మవారి ఆలయం చుట్టూ ఉన్న దుకాణాలు

చీపురుపల్లి: పట్టణంలోని విజయనగరం–పాలకొండ ప్రధాన రహదారిలో సంతానలక్ష్మి అమ్మవారి ఆలయం వద్ద రోడ్డుపై దుకాణాల నిర్వహణ తో ట్రాఫిక్ సమస్యలు తలెత్తుతున్నాయని వాహన చోదకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మెయిన్ రోడ్‌ను ఆనుకుని ఉన్న అమ్మవారి ఆలయం చుట్టూ ప్రధానంగా ఉదయం 11 గంటల లోపు, సాయంత్రం 4 గంటల తర్వాత కూరగాయలతో పాటు వివిధ దుకాణాలు ఏర్పాటు చేస్తుండడంతో వాహన రాకపోకలకు అంతరాయం ఏర్పడుతోంది. ఈ విషయంపై స్థానికంగా కొంత మంది పంచాయతీ కార్యాలయానికి ఫిర్యాదు చేసినట్లు సమాచారం. ఉమానీలకంఠేశ్వరస్వామి దేవస్థానం, చేపల బజార్, బాలుర ఉన్నత పాఠశాల, బస్టాండ్ ప్రాథమిక పాఠశాల తదితర ప్రాంతాలకు సంతానలక్ష్మి అమ్మవారి ఆలయం పక్క నుంచే దారి. అయితే ఆలయం చుట్టూ బడ్డీలతో పాటు కూరగాయల దుకాణాలు, టిఫిన్ దుకాణాలు చాలా కాలంగా పెట్టుకుంటుండడంతో ట్రాఫిక్ సమస్యలు ఎదుర్కొనాల్సి వస్తోందని పలువురు ఆవేదన చెందుతున్నారు. ఓ వైపు మెయిన్‌రోడ్ ట్రాఫిక్, మరోవైపు దుకాణాల వద్ద నిలిచిపోయే వాహనాలతో అవస్థలు తప్పడం లేదంటున్నారు.

13 నుంచి ఆలయప్రతిష్ఠోత్సవాలు

దత్తిరాజేరు: మండలంలోని దాసుపేట గ్రామంలో కోదండ సీతారామస్వామి ఆలయ ప్రతిష్ఠోత్సవాలు ఈనెల 13 నుంచి 15వ తేదీ వరకు నిర్వహించనున్నట్లు గ్రామపెద్ద శంకరరావు సోమవారం తెలిపారు. 13న మధ్యాహ్నం విగ్రహాల ఊరేగింపు, 14న హోమం,యజ్ఞయాగాది కార్యక్రమాలు, 15న ఉదయం పసిడి కలశస్థాపన,విగ్రహాల ప్రతిష్టాపన చేయనున్నట్లు చెప్పారు. ముగింపురోజు మధ్యాహ్నం ఆలయం వద్ద అన్న సమారాధన నిర్వహించనున్నామని, మూడు రోజుల పాటు సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశామని పేర్కొన్నారు.

ముఖ్య వ్యక్తుల భద్రతలో అప్రమత్తం



ప్రశంసాపత్రాలు అందుకున్న వారితో ఎస్పీ వకుల్ జిందల్

విజయనగరం క్రైమ్: జిల్లా పోలీసుశాఖలో పనిచేస్తూ ముఖ్య వ్యక్తుల భద్రత విధులు నిర్వహించే (పీఎస్‌ఓ) వారి వృత్తి నైపుణ్యాన్ని మెరుగుపర్చేందుకు నిర్వహించిన రెండురోజుల శిక్షణ కార్యక్రమంలో ప్రతిభ కనబర్చిన పోలీసు సిబ్బందిని ఎస్పీ వకుల్ జిందల్ సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలో అభినందించి, ప్రశంసాపత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్య వ్యక్తుల భద్రత విధులు నిర్వహించే పోలీస్ సిబ్బంది ఎల్లప్పుడూ అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఇతర పోలీసు విధులు నిర్వహించడం కంటే ముఖ్య వ్యక్తుల భద్రత విధులు నిర్వహించడం విభిన్నమైందని, నిరంతరం అప్రమత్తంగా ఉండాలన్నారు. ఈ భద్రత విధుల నిర్వహణను మరింత మెరుగు పరిచేందుకు రెండురోజుల పాటు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించామన్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న సిబ్బంది శారీరక దారుఢ్యాన్ని మెరుగుపర్చడంతో పాటు ఫైరింగ్ ప్రాక్టీస్ కూడా చేపట్టామన్నారు. ఈ శిక్షణలోనూ, ఫైరింగ్‌లోనూ ప్రతిభ కనబర్చిన పోలీసు కానిస్టేబు ళ్లు కె. త్రినాథరావు, ఎ.దుర్గాప్రసాద్, వి.శ్రీనివాసరావు, ఎ.పైడిరాజు, షేక్ మెహరాజ్‌లను ఎస్పీ ప్రత్యేకంగా అభినందించి, ప్రశంసాపత్రాలను ప్రదానం చేశారు. కార్యక్రమంలో ఏఆర్ అదనపు ఎస్పీ జి.నాగేశ్వరరావు, ఆర్‌ఐ సెక్యూరిటీ టి.శ్రీనివాసరావు పాల్గొన్నారు.